క్లుప్తంగా

జక్కంపూడి కాలనీలో ఉచిత వైద్యశిబిరం



చిట్టినగర్(విజయవాడపశ్చిమ): బుడమేరు వరద ముంపునకు గురైన జక్కంపూడి వైఎస్సార్ కాలనీలో విజన్ ఫర్ ఏషియా స్వచ్ఛంద సంస్థ మంగళవారం ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసింది. ఆశ్రయం హ్యాండ్ ఆఫ్ హోప్, వీఫోర్‌యు ట్రస్ట్ హైదరాబాద్ వారి సౌజన్యంతో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో కాలనీకి చెందిన సుమారు 500 మంది సేవలను వినియోగించుకున్నారు. ఈ శిబిరంలో వైద్యులు ప్రసాద్, స్వరూప్, వాసవి, సుష్మా, ఆశ్రమ్ పారా మెడికల్ సిబ్బంది తమ వైద్య సేవలను అందించినట్లు వీఫోర్‌యు ట్రస్ట్ ఫౌండర్ పి.శ్రీనివాస్ తెలిపారు. ఎటువంటి ఫీజులు లేకుండా ఉచితంగా రక్తపరీక్షలు, బీపీ, షుగర్, ఎక్స్-రే, ఈసీజీ, కంటి వైద్యపరీక్షలు చేసినట్టు నిర్వాహకులు తెలిపారు. పరీక్షలు చేయించుకున్న వారికి మందులతో పాటు కంటి అద్దాలను అందజేశామని చెప్పారు.

దుర్గమ్మ సన్నిధిలో కూచిపూడి నృత్య ప్రదర్శన

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో మంగళవారం కూచిపూడి నృత్య ప్రదర్శన జరిగింది. కూచిపూడి గ్రామానికి చెందిన సత్యకృష్ణ కూచిపూడి కళా నిలయానికి చెందిన పలువురు కళాకారులు అమ్మవారి సన్నిధిలో నృత్య ప్రదర్శన ఇచ్చారు. మంగళవారం సాయంత్రం అమ్మవారికి పంచహారతుల సేవ అనంతరం ఆలయ ప్రాంగణంలోని ధర్మపథం వేదికపై నృత్య ప్రదర్శన ఇవ్వగా, భక్తులు విశేషంగా తరలివచ్చి వీక్షించారు. అనంతరం ప్రదర్శనలో పాల్గొన్న శిష్యబృందానికి అమ్మవారి దర్శనం కల్పించి ప్రసాదాలను అందజేశారు.

నేత్రపర్వంగా గణపతి నగరోత్సవాలు



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పాతబస్తీలోని ఆలయాల్లో కొలువై ఉన్న గణనాథుల నగరోత్సవాలు మంగళవారం నేత్రపర్వంగా కొనసాగాయి. ఆలయాల్లో జరుగుతున్న స్వామి వారి ఉత్సవాల్లో భాగంగా ఆయా స్వామి వార్ల ఉత్సవమూర్తులను అంగరంగ వైభవంగా అలంకరించిన వాహనాలపై పాతబస్తీలో ఊరేగించారు. కెనాల్‌రోడ్డులోని శ్రీ వినాయకస్వామి వారి దేవస్థానంలో స్వామి వారి ఉత్సవమూర్తికి నగరోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. మూషిక వాహనదారుడై స్వామి వారు ఊరేగారు. ఊరేగింపులో బేతాళ నృత్యాలను ప్రదర్శించారు. పూజారి వారి వీధిలోని శ్రీ బాల గణపతి ఆలయం స్వామి వారు సైతం గురువారం నగరోత్సవంలో ఊరేగారు. స్వామి వారి నగరోత్సవాన్ని పురస్కరించుకొని వివిధ జానపద కళారూపాలతో అలరించారు. ఈ సందర్భంగా ప్రధాన ఉత్సవమూర్తిని వాహనంపై అధిష్ఠింపజేయగా, మరో ఉత్సవమూర్తిని పల్లకీలో ఊరేగించారు. ఆయా ఆలయాల కమిటీల సభ్యులు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

ముంపు బాధితులకు భారత్ వికాస్ పరిషత్ వితరణ



భవానీపురం(విజయవాడపశ్చిమ): బుడమేరు వరద ప్రభావిత ప్రాంతాలైన విద్యాధరపురం, హౌసింగ్‌బోర్డ్ కాలనీ, అజిత్‌సింగ్‌నగర్, కండ్రిక, వాంబేకాలనీ, రాజీవ్‌నగర్‌లోని బాధితులకు భారత్ వికాస్ పరిషత్ ఆధ్వర్యంలో మంగళవారం నిత్యావసర వస్తువులు, దోమ తెరలు, దుప్పట్లు వితరణగా అందజేశారు. ఆదామా ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సౌజన్యంతో సత్యనారాయణపురంలోని విజ్ఞాన్ విహార్, శిశు విద్యామందిర్ పాఠశాలల్లో పైన పేర్కొన్న ప్రాంతాల్లోని సుమారు వెయ్యి మంది బాధితులకు ఆయా వస్తువులతో కూడిన కిట్లను అందజేశారు. కార్యక్రమంలో భారత్ వికాస్ పరిషత్ ప్రాంతీయ అధ్యక్షుడు రూప్‌చంద్ జైన్, కార్యదర్శి కమల్ నయన్ బాంగ్, ఆర్థిక కార్యదర్శి ఎంవీఎస్ రామచంద్రరావు, ప్రాంతీయ కార్యదర్శి మురళీధర్, ఆదామా సంస్థ జనరల్ మేనేజర్ హనుమంతరావు, విజయవాడలోని వివిధ శాఖల అధ్యక్ష, కార్యదర్శి, కోశాధికారులు పాల్గొన్నారు.

22న అక్షర శిల్పి ఆత్రేయ గ్రంథావిష్కరణ

విజయవాడకల్చరల్: ఎక్స్‌రే సాహిత్యసేవా సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 22 వ తేదీ సాయంత్రం 6 గంటలకు ప్రముఖ సినీ పరిశోధకుడు పైడిపాల రచించిన ''అక్షర శిల్పి ఆత్రేయ'' గ్రంథావిష్కరణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు సంస్థ అధ్యక్ష , కార్యదర్శులు కొల్లూరి, బోడి ఆంజనేయ రాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

వరద బాధితులకు అండగా వైఎస్సార్ సీపీ

వైఎస్సార్ సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆసిఫ్



కంసాలిపేటలో నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న ఆసిఫ్



జెండా ఊపి సరుకుల వాహనాలను ప్రారంభిస్తున్న ఆసిఫ్

వించిపేట/వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): అధికారంలో ఉన్నా.. ప్రతిపక్షంలో ఉన్నా ప్రజల సంక్షేమమే తమకు ముఖ్యమని, తమ పార్టీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు వరద ముంపునకు గురై కష్టాల్లో ఉన్న బాధితులకు అండగా నిలబడుతున్నామని పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త షేక్ ఆసిఫ్ అన్నారు. శాసనమండలి పక్ష నేత బొత్స సత్యనారాయణ పర్యవేక్షణలో మంగళవారం రాత్రి పార్టీ ఆధ్వర్యంలో 55వ డివిజన్‌లో ముంపు బాధితులకు నిత్యావసరాలను పంపిణీ చేశారు. స్థానిక కార్పొరేటర్ శీరంశెట్టి పూర్ణచంద్రరావుతో కలసి వించిపేట, కంసాలిపేట ప్రాంతంలోని ప్రతి ఇంటిని సందర్శించి బాధితులను పరామర్శించారు. వరద ముంపునకు గురై ఇంట్లోని వస్తువులు, గృహోపకరణాలను కోల్పోయిన బాధితులకు ప్రభుత్వం నష్టపరిహారం అందజేసి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అంతకుముందు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పశ్చిమ నియోజకవర్గంలో వరద బాధితులకు పంపిణీ చేయనున్న సరుకుల వాహనాలను ఆసిఫ్ మంగళవారం సాయంత్రం జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ యలకల చలపతిరావు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేతలు దేరంగుల రమణ, మజ్జి శ్రీనివాసరావు, గోమతోటి వినోద్‌పాల్, ఎండీ అఫ్సర్ పాల్గొన్నారు.

వైభవంగా విశ్వకర్మ జయంత్యుత్సవాలు



విశ్వకర్మకు పూజలు నిర్వహిస్తున్న శ్రీనివాస చక్రవర్తి, తోలేటి శ్రీకాంత్ తదితరులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): శ్రీ కామాక్షి స్వర్ణకార సంఘం ఆధ్వర్యంలో విశ్వకర్మ జయంతి వేడుకలు మంగళవారం వన్‌టౌన్‌లోని మాడపాటి సోషల్ క్లబ్ ఆవరణలో వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అతిథులు, నిర్వాహకులు విశ్వకర్మ చిత్రపటానికి పూజలు చేసి పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం అవార్డులను ప్రదానం చేశారు. శ్రీ కామాక్షి స్వర్ణకార సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఎన్టీఆర్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్, నాయకులు పైలా సోమినాయుడు హాజరయ్యారు. ఈ సందర్భంగా నందిపాటి వీరాచారి స్మారక అవార్డును చలపాక ప్రకాష్‌కు, గోలి వీరచంద్రరావు స్మారక అవార్డును అవ్వారు బుల్లబ్బాయికి, మహమ్మద్ బాషాకు అందజేశారు. విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, మహిళలకు కుట్టు మిషన్లు, వికలాంగులకు వీల్ చైర్లు, పేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి పోతులూరి ఆచారి, కార్యనిర్వాహక అధ్యక్షుడు కటకం మోహన్ మురళి, కోశాధికారి షేక్ సలీం, గౌరవ సలహాదారులు యంగల శ్రీనివాసరావు, మందరపు సూర్యప్రకాష్, అందే వరదయ్య సంఘం సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్నారులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

విశ్వబ్రాహ్మణులకు పెద్దపీట వేయాలి

విశ్వబ్రాహ్మణులకు ప్రభుత్వం పెద్ద పీట వేయాలని విజయవాడ విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గొర్తి శ్రీనివాస చక్రవర్తి, తోలేటి శ్రీకాంత్ కోరారు. విజయవాడ విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు గొర్తి శ్రీనివాస చక్రవర్తి ఆధ్వర్యంలో భగవాన్ విశ్వకర్మ జయంతి కార్యక్రమాన్ని వన్‌టౌన్ అమ్మా హోటల్ సమీపంలోని టీకు నరసింహాచారి ట్రస్ట్ కార్యాలయంలో మంగళవారం వైభవంగా నిర్వహించారు. తొలుత భగవాన్ విశ్వకర్మ చిత్రపటానికి పూజలు చేసి పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విజయవాడ విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గొర్తి శ్రీనివాస చక్రవర్తి, తోలేటి శ్రీకాంత్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విశ్వబ్రాహ్మణ సంక్షేమానికి పెద్ద పీట వేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు నడిపల్లి ప్రసాద్, పెదపోలు బ్రహ్మం, జగన్, బ్రహ్మచారి పాల్గొన్నారు.

వైభవంగా గణేష్ నిమజ్జనాలు



ఊరేగుతున్న వస్త్రలత గణనాథుడు



నిమజ్జనానికి పూజారివారి వీధిలోని స్వామి విగ్రహం



మార్వాడీ సంఘం గణనాథుడు



పూలబావి వీధికి చెందిన భారీ గణనాథుడు

- కృష్ణమ్మ ఒడికి చేరుకున్న భారీ గణపతులు
- పాతబస్తీలో భారీ ఊరేగింపులతో ప్రధాన పందిళ్ల గణపతులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పాతబస్తీలోని గణేష్ నిమజ్జనాలు సోమవారం అర్ధరాత్రి కొన్ని, మంగళవారం మరికొన్ని అత్యంత వైభవంగా జరిగాయి. రెండు రోజులుగా భారీ విగ్రహాలన్నీ కృష్ణమ్మ ఒడికి చేరుకుంటున్నాయి. పాతబస్తీలోని ప్రముఖ సంస్థలకు చెందిన విగ్రహాల ఊరేగింపులను ఆయా నిర్వాహకులు అత్యంత భారీగా నిర్వహించారు. మంగళ వాయిద్యాలు, డప్పుల విన్యాసాలు, వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన జానపద కళాకారుల ప్రదర్శనలతో, చిత్ర విచిత్ర వేషధారణలతో స్వామి వారి నిమజ్జన ఊరేగింపులు ముందుకు సాగాయి. క్లాత్ మర్చంట్స్ అసోసియేషన్ (వస్త్రలత) ఆధ్వర్యంలో వారి వ్యాపార సముదాయంలో ఉంచిన రెండు విగ్రహాలను భారీ వాహనాలపై అధిష్టింపజేసి ఊరేగించారు. వివిధ చవితి పందిళ్ల నిర్వాహకులు ఏర్పాటు చేసిన కళారూపాలు ఆకట్టుకున్నాయి. తమిళనాడు, కేరళ నుంచి వచ్చిన కళాకారులతో ప్రదర్శనలిప్పిస్తూ ఊరేగింపు నిర్వహించారు. గణేష్ ఉత్సవ సమితి (మార్వాడీ సంఘం) ఆధ్వర్యంలోనూ భారీ ఊరేగింపుగా స్వామి వారిని నిమజ్జనానికి తరలించారు. ఐదు దశాబ్దాల నుంచి ఉత్సవాలను నిర్వహిస్తున్న ఉమా పుత్ర సేవా సమితి (పూలబావి వీధి) నిర్వాహకులు సైతం స్వామి వారిని నిమజ్జనానికి వైభవంగా తరలించారు. పూజారివారి వీధిలోని శ్రీ బాలగణపతి సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకమూర్తిని ఊరేగించారు. రాయల్ హోటల్ సెంటర్‌లోని మిత్ర బృందం తమ గణపతిని నిమజ్జనానికి అంగరంగ వైభవంగా తరలించారు. మెయిన్‌బజార్‌లోని వివిధ సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలను కూడా నిమజ్జనానికి తరలించారు.

30న మినీ బ్యూటీ ఎక్స్ పో

- హాజరుకానున్న హెయిర్ డిజైనర్స్, బాలీవుడ్‌కు చెందిన మేకప్ ఆర్టిస్టులు
- పోస్టర్ ఆవిష్కరించిన నిర్వాహకులు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): విజయవాడ బందరురోడ్డులోని ఎస్ఎస్ కన్వెన్షన్ హాలులో ఈ నెల 30న మినీ బ్యూటీ ఎక్స్‌పో నిర్వహిస్తున్నామని ఎస్‌బీఎంఎస్ అకాడమీ ప్రతినిధులు మోక్స్, రాఘవరెడ్డి చెప్పారు. బ్యూటీ ఎక్స్‌పోకు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం మంగళవారం మొగల్రాజపురంలోని ఒక హోటల్‌లో జరిగింది. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ ఎక్స్‌పోలో బాలీవుడ్‌కు చెందిన సెలబ్రిటీల మేకప్ ఆర్టిస్టులతో పాటుగా ప్రముఖ హెయిర్ డిజైనర్ జావిద్ హబీబ్, డాక్టర్ ఆమోద్ పాల్గొంటారని తెలిపారు. ఈనెల 30వ తేదీ ఉదయం 10 నుంచి సాయంత్రం 6:30 గంటల వరకు ఈ ఎక్స్‌పో జరుగుతుందన్నారు. హెయిర్ కట్, హెయిర్ డిజైనింగ్, మేకప్‌లకు సంబంధించిన ఉత్పత్తుల ప్రదర్శన కూడా ఉంటుందన్నారు. ఆంధ్రప్రదేశ్ నాయీ బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు సూరిబాబు మాట్లాడుతూ బాలీవుడ్ సెలబ్రిటీ హెయిర్ కట్స్ గురించి, ఎస్ఎఫ్ఎక్స్, లోకల్ సెలబ్రిటీస్ మేకప్‌ల గురించి అవగాహన సదస్సులతో పాటుగా ఈ రంగంలోని నిష్ణాతులకు సన్మానం అనంతరం ఫ్యాషన్ షో ఉంటాయని చెప్పారు. మేకప్ ఆర్టిస్టులు జ్యోతి, లిల్లీ, షహనా, ప్రణవి, రజియా, రుక్సానా, ఉదయ, సిరి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలివే

భవానీపురం(విజయవాడపశ్చిమ): భవానీపురం పరిధిలోని 11 కేవీ టీచర్స్ కాలనీ ఫీడర్ విద్యుత్ లైన్ల మరమ్మతులలో భాగంగా కొన్ని ప్రాంతాలలో రెండు గంటలపాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీసీపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (విజయవాడ టౌన్) టీవీ సుధాకర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు టీచర్స్ కాలనీ, అప్నా బజార్ రోడ్, ఇందిరా ప్రియదర్శిని కాలనీ, దర్గా ప్లాట్స్, 450 ఎస్ఎఫ్‌టీ బ్లాక్స్ ప్రాంతాల్లో పైన పేర్కొన్న సమయంలో కరెంట్ సరఫరా నిలిపివేయనున్నట్లు వివరించారు. విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

మహిళను మోసం చేసిన వ్యక్తిపై కేసు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): తనను మోసం చేశాడంటూ ఓ మహిళ ఇచ్చిన ఫిర్యాదుపై భవానీపురం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు...రామరాజ్యనగర్ సొరంగం రోడ్డుకు చెందిన తలతోటి వెంకటరమణ విద్యాధరపురం డిపోలో స్వీపర్‌గా పనిచేస్తోంది. అదే డిపోలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్న బి.రాజేష్‌తో ఐదేళ్ల నుంచి సహజీవనం చేస్తోంది. మూడేళ్ల క్రితం రాజేష్ ఆమెకు తాళి కట్టాడు. గత నెలలో అతనికి మరో మహిళతో ఎంగేజ్‌మెంట్ జరగడంతో రాజేష్ తనను నమ్మించి మోసం చేశాడంటూ వెంకటరమణ భవానీపురం పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేశారు.

విజయవాడ రైల్వేడివిజన్‌లో స్వచ్ఛతా హీ సేవా ప్రచారం



రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): దక్షిణ మధ్య రైల్వే విజయవాడ డివిజన్ వ్యాప్తంగా 'స్వచ్ఛత హీ సేవా' పేరుతో పర్యావరణంపై అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. స్వచ్ఛభారత్ మిషన్‌లో భాగంగా పక్షం రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమాలు అక్టోబర్ 2న ముగుస్తాయి. అందులో భాగంగా మంగళవారం విజయవాడ స్టేషన్ క్లాక్ టవర్ వద్ద జరిగిన కార్యక్రమంలో డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్ పాల్గొని అధికారులు, సిబ్బందితో స్వచ్ఛతా ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తూ ప్లకార్డులను చేతపట్టుకుని క్లాక్ టవర్ నుంచి 1వ నంబర్ ప్లాట్‌ఫామ్‌లోని గాంధీ వెయిటింగ్ హాల్ వరకు ప్రదర్శన నిర్వహించారు. అనంతరం పార్శిల్ కార్యాలయం వద్ద బ్రాంచ్ అధికారులతో కలసి మొక్కలు నాటి, పరిసరాలను శుభ్రపర్చారు. ఈ సందర్భంగా డీఆర్ఎం మాట్లాడుతూ అర్బన్, సెమీ అర్బన్ ప్రాంతాల్లోని రైల్వే ట్రాక్‌లు, డ్రైన్‌లు, మరుగుదొడ్లు, ఇతర బహిరంగ ప్రదేశాలను శుభ్రపర్చడంపై శ్రద్ధ పెట్టినట్లు తెలిపారు. అందుకోసం 500 సీటీయూ (క్లీన్‌నెస్ టార్గెట్ యూనిట్స్)లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. డివిజన్‌లో పర్యావరణ అనుకూల పద్ధతులను ప్రోత్సహించేందుకు క్లాత్, పేపర్, జనపనార సంచులను ఉపయోగించాల్సిందిగా పిలుపునిచ్చారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌లపై నిషేధాన్ని కఠినంగా అమలు చేయాలని ఆదేశించారు. అనంతరం ప్రయాణికులకు క్లాత్ బ్యాగులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పలు విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పర్యావరణాన్ని కాపాడుదాం

జాతీయ రహదారుల వెంట మొక్కలు నాటిన ఎన్‌హెచ్‌ఏఐ విజయవాడ ఇన్‌చార్జ్ ఆర్‌కే సింగ్



మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): పర్యావరణ సమతుల్యతను కాపాడటంతో పాటు జాతీయ రహదారులను సుందరీకరించేందుకు నేషనల్ హైవేల సమీపంలో మొక్కలు పెంచే కార్యక్రమాన్ని చేపట్టామని జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ) విజయవాడ ప్రాంతీయ అధికారి ఆర్‌కే సింగ్ చెప్పారు. విజయవాడ సమీపంలోని చినఅవుటపల్లి దగ్గర మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్ (ఎంఈఐఎల్) నిర్మిస్తున్న చినఅవుటపల్లి–గొల్లపూడి బైపాస్ రోడ్డులో ఎన్‌హెచ్‌ఏఐ ఆధ్వర్యంలో మంగళవారం మొక్కలు నాటే కార్యక్రమం జరిగింది. ఆర్‌కే సింగ్ హాజరై విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ రహదారుల వెంట పర్యావరణాన్ని కాపాడటంతో పాటు వాహనదారులకు స్వచ్ఛమైన గాలిని అందించేందుకు తమ సంస్థ కృషి చేస్తోందన్నారు. ఎన్‌హెచ్‌ఏఐ విజయవాడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వి.శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ ప్రకృతి విపత్తులు సంభవించినపుడు నేల కోతకు గురి కాకుండా చెట్లు కాపాడతాయన్నారు. మొక్కల పెంపకంతో పాటు జాతీయ రహదారులను పరిశుభ్రంగా ఉంచాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. అనంతరం మొక్కలను నాటి వాటిని సంరక్షిస్తామంటూ ఎన్‌హెచ్‌ఏఐ, ఎంఈఐఎల్ అధికారులు, సిబ్బందితో పాటుగా పాఠశాల, కళాశాల విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. ఎన్‌హెచ్‌ఏఐ (మొక్కల పెంపకం విభాగం) ఇన్‌చార్జి కె.సూర్యనారాయణ, డీజీఎంలు నీరజాగుప్తా, కేవీడీ రజని, కృష్ణమూర్తి, మేనేజర్లు వీవీ లక్ష్మి, కె.లత పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అనంత పద్మనాభస్వామి వ్రతం



అనంత పద్మనాభ స్వామి వారి వ్రతాన్ని ఆచరిస్తున్న ఉభయదాతలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): చిట్టినగర్‌లోని శ్రీ అనంత పద్మనాభ స్వామి వారి ఆలయంలో మంగళవారం స్వామి వారి వ్రతాన్ని భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో ఆచరించారు. చిట్టినగర్‌లోని శ్రీమహాలక్ష్మీ అమ్మవారి ఆలయ ప్రాంగణంలో ఉన్న అనంత పద్మనాభ స్వామి వారి ఆలయంలో ఉదయం స్వామి వారికి విశేష అభిషేకాలు, తులసీ దళార్చన అనంతరం ఆలయ ప్రాంగణంలోని ఆస్థాన కల్యాణ మండపంలో స్వామి వారి వ్రతాన్ని నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు వినుకొండ రామరత్నమాచార్యులు ఉభయదాతలతో స్వామి వారి వ్రతాన్ని ఆచరింపచేసి, వ్రత మహత్యం వివరించారు. వ్రతాన్ని ఆచరించిన భక్తులు, ఉభయదాతల ఇంట ఎటువంటి ఆర్థిక ఇబ్బందులు ఉండవని అన్నారు. వ్రతంలో పాల్గొన్న ఉభయదాతలకు స్వామి వారి ప్రసాదాలను అందజేశారు.

స్వభావంలో, సంస్కారంలో స్వచ్ఛత ఉండాలి

స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఎండీ గంధం చంద్రుడు



స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో మాట్లాడుతున్న గంధం చంద్రుడు

పటమట(విజయవాడతూర్పు): స్వభావంలో, సంస్కారంలో స్వచ్ఛత ఉండాలని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఎండీ గంధం చంద్రుడు అన్నారు. విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో మంగళవారం అజిత్‌సింగ్‌నగర్‌లోని మాకినేని బసవ పున్నయ్య స్టేడియంలో ఈ నెల 17 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు జరిగే స్వచ్ఛతా హి సేవ కార్యక్రమ ప్రారంభోత్సవం జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన చంద్రుడు మాట్లాడుతూ రెండేళ్ల క్రితం తాను అమెరికాలో చదువుకుంటున్నప్పుడు బోస్టన్‌లో చార్లెస్ రివర్ దగ్గర ఓ మహిళ పెంపుడు కుక్కని తీసుకురాగా అనుకోని పరిస్థితిలో అది మలవిసర్జన చేసిందని, ఆ మహిళ అలాగే వదిలేయకుండా దాన్ని పరిశుభ్రపరిచారని, ఆ తరహాలోనే ప్రతి ఒక్కరూ తామంత తామే పరిశుభ్రత పట్ల దృఢ సంకల్పంతో ఉండాలన్నారు. సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ ప్రతిరోజు మన ఇంటిని మన పరిసరాలని ఎలా పరిశుభ్రంగా ఉంచుకుంటామో అంతకంటే ఎక్కువ పరిశుభ్రంగా మన విజయవాడని ఉంచాలని అన్నారు. మొక్కలు నాటడం ఒక అలవాటుగా చేసుకోవాలని, అవి మనిషికి ప్రాణవాయువు ఇస్తాయని అన్నారు. వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర మాట్లాడుతూ 2014లో స్వచ్ఛభారత్ మిషన్ మొదలుపెట్టాక, ఈ పదేళ్లలో విజయవాడ నగరపాలక సంస్థ 3, 5, 6వ స్థానాలు కైవసం చేసుకుందని, దీనికి నగర ప్రజలందరి సహకారమే కారణమని అన్నారు. అనంతరం స్వచ్ఛ విజయవాడ బ్రాండ్ అంబాసిడర్ డాక్టర్ జి.సమరం మొక్కలు నాటారు. అంతకు ముందు స్వచ్ఛత హి సేవ కార్యక్రమ పోస్టర్‌ను ఆవిష్కరించారు. పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించే ర్యాలీ నిర్వహించారు. అనంతరం 58, 59, 60 వ డివిజన్లలో పరిసరాలన్నీ పరిశుభ్రపరిచారు. కార్యక్రమంలో విజయవాడ నగరపాలక సంస్థ అడిషనల్ కమిషనర్ (ప్రాజెక్ట్స్) కేవీ సత్యవతి, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పి.రత్నావళి, డిప్యూటీ కమిషనర్ (రెవెన్యూ) జి.సృజన, డిప్యూటీ సిటీ ప్లానర్ జుబిన్, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్లు, జోనల్ కమిషనర్లు, ఎస్ఆర్‌కే ఇంజినీరింగ్ విద్యార్థులు, ఆంధ్ర లయోలా కళాశాల విద్యార్థులు, ఎంకే బేగ్ స్కూల్ విద్యార్థులు, డాక్టర్ జేడీఎంఎంసీ హైస్కూల్ విద్యార్థులు, ఎస్పీఎస్ఎంసీ స్కూల్ విద్యార్థులు, వివేకానంద సెంటినరీ హైస్కూల్, పోలీస్ బృందం, సీవీఆర్ లయన్స్ క్లబ్, డీటీఆర్సీ ఎన్జీవో, అమృత హస్తం చారిటబుల్ ట్రస్ట్ తదితరులు పాల్గొన్నారు.

26 నుంచి దసరా సాంస్కృతికోత్సవాలు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

కృష్ణలంక(విజయవాడతూర్పు): దసరా పండుగను పురస్కరించుకుని ఈ నెల 26వ తేదీ నుంచి మూడు రోజుల పాటు దసరా సాంస్కృతికోత్సవాలు నిర్వహిస్తున్నామని ఎం.బి.విజ్ఞాన కేంద్రం బాధ్యులు స్వరూపరాణి, సేఫ్ అధ్యక్షురాలు జి.జోత్స్న తెలిపారు. రాఘవయ్య పార్కు సమీపంలోని ఎం.బి. విజ్ఞాన కేంద్రంలో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో దసరా సాంస్కృతికోత్సవాలకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువతీ యువకుల్లో సృజనాత్మకత, సమాజం పట్ల అవగాహన పెంచేందుకు దసరా ఉత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. దసరా ఉత్సవాలు చెడు నుంచి మంచి వైపు యువతను తీసుకువెళ్లడానికి ఉపయోగపడేందుకు దోహదపడాలని 'చెడును దునుమాడుదాం-మంచిని పెంచుదాం' అనే థీమ్‌తో ఈవెంట్స్‌ను రూపొందించామన్నారు. ఎం.బి.విజ్ఞాన కేంద్రం, సేఫ్, తరుణీ తరంగాలు, స్ఫూహార్తి ఆర్గనైజేషన్, ఫోరం ఫర్ ఆర్టిస్ట్స్, జన శిక్షణ సంస్థాన్, భారత మహిళా మండలి, ఇన్నర్ వీల్-దివాస్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 26, 27, 28 తేదీలలో విజయవాడలో దసరా సాంస్కృతికోత్సవాలు జరుగుతాయన్నారు. 26, 27 తేదీల్లో విజ్ఞాన కేంద్రంలో శాస్త్రీయ, జానపద నృత్యాలు, అభ్యుదయ దేశభక్తి గీతాలాపన, లఘు నాటికలు, స్పాట్ స్కిట్స్, వ్యక్తిత్వ పోటీలు, వీధి నాటకం, వక్తృత్వం, వాద ప్రతివాదాలు, 28న ఉదయం 10 గంటలకు సిద్ధార్థ అకాడమీలో కోలాటాలు, ఫ్లాష్ మాబ్ జరుగుతాయని వివరించారు. పెద్ద సంఖ్యలో పాల్గొని దసరా ఉత్సవాలను జయప్రదం చేయాలని కోరారు. ఆసక్తి కలవారు ఈ నెల 20వ తేదీ లోగా దరఖాస్తులు పంపాలని కోరారు. సమావేశంలో పి.విజయ, పి.వాణి, ఎ.సుమబిందు, శాంతి రెడ్డి, పి.శ్వేత, వి.సూర్యకామేశ్వరి, ఉషారాజా, ఎ.పూర్ణిమ తదితరులు పాల్గొన్నారు.

వరదల్లో మునిగిన ఆరోగ్య కేంద్రాల పరిశీలన



నీట మునిగి పాడైన యూపీహెచ్‌సీ సామగ్రిని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ మాచర్ల సుహాసిని

లబ్బీపేట(విజయవాడతూర్పు): బుడమేరు వరదలో మునిగిన నగరంలోని పలు పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను మంగళవారం ఎన్టీఆర్ జిల్లా డీఎంహెచ్‌ఓ డాక్టర్ మాచర్ల సుహాసిని పరిశీలించారు. రాజీవ్‌నగర్, ప్రకాష్‌నగర్, శాంతినగర్, కండ్రిక, సింగ్‌నగర్, లంబాడీపేటల్లోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు వరదలతో సేవలు పూర్తిగా నిలిచిపోవడంతో, మళ్లీ సేవలు ప్రారంభించేలా చేస్తున్న ఏర్పాట్లను ఆమె తిలకించారు. ఆయా యూపీహెచ్‌సీల్లో నీటిలో మునిగి పాడైన సామగ్రి, మందులు, వ్యాధి నిర్ధారణ యంత్రాలను పరిశీలించారు. వరదలతో ఏర్పడిన అపరిశుభ్ర పరిస్థితిని త్వరగా పరిశుభ్రం చేయాలన్నారు. రోగులకు వీలైనంత త్వరగా సేవలు అందించేలా యూపీహెచ్‌సీలను పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఆమె వెంట డీపీఓ మహేష్, ఆయా కేంద్రాల వైద్యాధికారులు పాల్గొన్నారు.

సచ్చిదానంద శాస్త్రి మృతి హరికథా రంగానికి తీరని లోటు



పద్మశ్రీ వచ్చిన సందర్భంగా కోట సచ్చిదానంద శాస్త్రికి నగరంలో జరిగిన సత్కార సభ(ఫైల్)

విజయవాడ కల్చరల్: ప్రముఖ హరికథా భాగవతార్, పద్మశ్రీ అవార్డు గ్రహీత కోట సచ్చిదానంద శాస్త్రి మృతి హరికథా రంగానికి తీరనిలోటు అని విశ్వమాత చారిటబుల్ సంస్థ వ్యవస్థాపకుడు నిడుమోలు రమా సత్యనారాయణ గురువారం ఒక ప్రకటనలో సంతాపం వ్యక్తం చేశారు. కేబీఎన్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కప్పగంతు రామకృష్ణ మాట్లాడుతూ పద్మశ్రీ వచ్చిన సందర్భంగా డాక్టర్ దమ్మాలపాటి రామారావు మెమోరియల్ ట్రస్ట్ పక్షాన నగరంలో ఆయనను ఘనంగా సత్కరించిన సంగతిని గుర్తు చేసుకున్నారు.

సాంస్కృతిక సంస్థల సంతాపం

నగరానికి చెందిన వివిధ సాహితీ కళా సంస్థల ప్రతినిధులు, దమ్మాలపాటి చంద్రశేఖర్, చింతకాయల చిట్టిబాబు, శింగంశెట్టి చంద్రశేఖర్, బోడి ఆంజనేయరాజు, అమ్ముల ప్రసాద్, బ్యాంక్ ప్రసాద్, పరుచూరి విజయలక్ష్మి, శింగంశెట్టి చంద్రశేఖర్, కొల్లూరి బీవీఎస్ శర్మ సంతాపం వ్యక్తం చేశారు.

పీఎంఏవై 2.0 మార్గదర్శక సూత్రాలు విడుదల

పటమట(విజయవాడతూర్పు): అందరికీ గూడు కల్పించాలనే సంకల్పంతో ప్రారంభించిన ప్రధాన మంత్రి ఆవాస్ యోజన (పీఎంఏవై)లో పేదలందరికీ ఇళ్లను సమకూర్చాల్సిన బాధ్యత ఉందని వీఎంసీ అడిషనల్ కమిషనర్(జనరల్) డాక్టర్ ఎ. మహేష్ అన్నారు. ఈ మేరకు మంగళవారం విజయవాడ నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయం, నూతన భవనం సమావేశపు హాల్లో ప్రధానమంత్రి ఆవాస్ యోజన 2.0 ఆపరేషన్ గైడ్‌లైన్స్‌ను భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వివరించారు. పట్టణాల్లో నివసిస్తున్న ప్రజలందరికీ పక్కా ఇళ్లను కల్పించేందుకు దేశ వ్యాప్తంగా కోటి ఇళ్లను నిర్మిస్తున్నట్లు ప్రధాని పేర్కొన్నారని, దీనికి అధికారులు కృషి చేయాలని అడిషనల్ కమిషనర్ కోరారు. సమావేశంలో ఏపీ టిడ్కో ఎస్ఈ భూక్యా చిన్నోడు, కార్పొరేటర్లు బి.వి.కుమార్, వి.లలిత, అపర్ణ, ఉమ్మడి వెంకటేశ్వరరావు, ప్రధానమంత్రి ఆవాస్ యోజన లబ్ధిదారులు పాల్గొన్నారు.